క్లుప్తంగా

బీజేపీ ఆధ్వర్యంలో ప్రముఖులకు సత్కారం



తెనాలిరూరల్: బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని పలువురు ప్రముఖులను సత్కరించారు. పట్టణానికి చెందిన ప్రముఖ సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు వేజళ్ల ఉమామహేశ్వర్, అయినాల మల్లేశ్వరరావు, మాజీ సైనికుడు తాతా పోతురాజు, ప్రముఖ శిల్పి కాటూరి వెంకటేశ్వరరావులను పార్టీ నాయకులు గురువారం సత్కరించి వివిధ రంగాల్లో వారు అందించిన సేవలను ప్రశంసించారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కఠారి వాసుదేవనాయుడు, అడపా సంపత్‌రాయుడు, మండల అధ్యక్షుడు కడియాల నంద కిషోర్, తెనాలి మూడవ పట్టణ అధ్యక్షుడు యర్రంరాజు సందీప్, రెండవ పట్టణ ఇంచార్జ్ శిఖా రవీంద్ర, జిల్లా అధికార ప్రతినిధి తమరిన అనంతచార్యులు, మైలా హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

తెనాలిరూరల్: స్థానిక రామలింగేశ్వరపేటలో చోరీ జరిగింది. తాళం వేసివున్న ఇంటి తలుపులు పగలగొట్టి దుండగులు చోరీకి పాల్పడ్డారు. సేకరించిన వివరాల ప్రకారం బ్రాహ్మణ వీధికి చెందిన ఎం.ఫణి ప్రసాద్ తండ్రి ఇటీవల మరణించగా, తల్లిని నిద్ర నిమిత్తం విజయవాడ బంధువుల ఇంటికి పంపించారు. ఫణి ప్రసాద్ కూడా తన వ్యక్తిగత పనుల నిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్లాడు. ఇంటికి తాళం తీసి ఉండటంతో గురువారం ఉదయం గమనించిన స్థానికులు ఫోన్ చేసి ఇంటి తలుపులు తెరిచి ఉన్నట్లుగా ఫణి ప్రసాద్‌కు సమాచారం ఇవ్వడంతో, అతను వచ్చి పరిశీలించి చోరీ జరిగినట్లుగా నిర్ధారణకు వచ్చాడు. బంగారం, నగదు అపహరణకు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీం ఆధారాలు సేకరించేందుకు ప్రయత్నించింది. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాతల సహకారాన్ని అందిపుచ్చుకోండి

ప్రధానోపాధ్యాయుడు పి.అప్పారావు



కొల్లిపర: విద్యార్థులు దాతల సహకారాన్ని అంది పుచ్చుకొని చదువులో బాగా రాణించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.అప్పారావు అన్నారు. మండల పరిధిలోని మున్నంగి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం శ్రీనివాస ఫౌండేషన్ అధ్యక్షుడు మిరియాల యాకోబు ఆధ్వర్యంలో 250 మంది విద్యార్థులకు డైరీలు పరీక్ష మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస ఫౌండేషన్ అధ్యక్షుడు యాకోబు మాట్లాడుతూ ఫౌండేషన్ పేద విద్యార్థులకు ఎల్లవేళలా అన్ని విధాల అండదండలుగా ఉంటుందని తెలిపారు. పాఠశాలలో మెగా పేరెంట్స్ మీటింగ్ అనంతరం ఫౌండేషన్ తరఫున 2024 25 సంవత్సరంలో 10వ తరగతిలో ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సరస్వతి శిశుమందిర్‌లో గురుపూర్ణిమ



తెనాలిరూరల్: పట్టణ సుల్తానాబాద్ కుమార్ పంప్స్ కాలనీలోని సరస్వతి శిశుమందిర్‌లో గురు పూర్ణిమను ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు కలగా శ్రీనివాస రావు, యోగాచార్యుడు కోడూరి మల్లికార్జునరావులను సత్కరించారు. పాఠశాల కార్యదర్శి యర్రంశెట్టి హనుమంతరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చిలుమూరి రామలింగేశ్వరరావు, కోడూరు రమాదేవి, త్రిపురమల్లు పద్మజ, దూళ్ళ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బీమా సౌకర్యాన్ని రైతులు పొందాలి

తెనాలి: మండలంలోని రైతులందరూ ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద వరి, మినుము పంటలకు బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.సుధీర్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈనెల 31వ తేదీలోగా రైతు సేవాకేంద్రాలు లేదా బ్యాంకుల్లో ప్రీమియం చెల్లించి బీమా రక్షణ పొందాలని సూచించారు. వరి పంటకు ఎకరాకు రూ.800, మినుముకు రూ.200 చొప్పున రైతులు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విజయుడై.. అమరవీరుడై!!

- నేడు పారా కమెండో కెప్టెన్ విజయప్రసాద్ 37వ వర్ధంతి
- ఫౌండేషన్ పేరిట తల్లిదండ్రులు సేవా కార్యక్రమాలు

తెనాలి: విద్య, సాంస్కృతిక రంగాల్లో ప్రముఖంగా గుర్తింపు పొందిన తెనాలి ప్రాంతం దేశసేవలోనూ ముందంజలో ఉంటూ వస్తోంది. ఈ ప్రాంతంనుంచి ఎందరో సైన్యంలో పనిచేస్తున్నారు. నాటి రెండో ప్రపంచయుద్ధం నుంచి కార్గిల్ యుద్ధంలోనూ అసమాన ధైర్యసాహసాలను ప్రదర్శించిన సైనికులున్నారు. ప్రాణాలను తృణప్రాయంగా త్యజించిన అమరవీరులున్నారు. అందులో భారత సైనిక పారాకమెండో కెప్టెన్ యర్రమనేని విజయప్రసాద్ ఒకరు. భారత శాంతి పరిరక్షణ దళం సభ్యుడుగా శ్రీలంకలో విధుల నిర్వహణలో ఉండగా, ఎల్‌టీటీఈతో జరిగిన పోరులో 1988 జులై 11న అమరుడయ్యారు. ఏకైక కుమారుడి కడసారి చూపు కూడా దక్కని అతడి తల్లిదండ్రులు, ఏటా అతడి పేరిట వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ స్ఫూర్తిని నింపుతున్నారు.

తెనాలికి చెందిన కెప్టెన్ యరమ్రనేని విజయప్రసాద్ శ్రీలంకలో ఎల్‌టీటీఈతో జరిగిన పోరులో అమరవీరుడై ఇప్పటికి ముప్ఫయ్ ఏడేళ్లు. శ్రీలంకలో ఎల్‌టీటీఈ ప్రాబల్యం కలిగిన సముద్ర తీరంలో చలాయి వద్ద విజయప్రసాద్ బృందం పెట్రోలింగ్ చేస్తున్న పడవపై ఎల్‌టీటీఈ ఆర్మ్‌డ్ బృందం కాల్పులు జరిపింది. హోరాహోరీ జరిగిన ఎదురుకాల్పుల్లో విజయప్రసాద్, మరో కెప్టెన్ అక్కడికక్కడే వీరమరణం పొందగా, గాయపడిన మరో ఇరువురు తర్వాత చనిపోయారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పట్లో జరిగిన 'బలిమెల దుర్ఘటన'కు కోవర్ట్ ఆపరేషను దోహదం చేసి ఉంటుందన్న ఊహాగానాలున్నట్టే, విజయప్రసాద్ బృందం పడవపై దాడివెనుక శత్రువులకు ముందస్తు సమాచారం అంది ఉంటుందనే అనుమానాలున్నాయి. బుల్లెట్ల వర్షంతో ధ్వంసమైన పడవ తీవ్రమైన దాడికి అద్దంపడితే, అప్పటి సంఘటనకు సంబంధించిన కీలక సమాచారం, దాడి జరిగిన రెండు దశాబ్దాల తర్వాత తెనాలిలోని విజయప్రసాద్ తల్లిదండ్రులకు అందటం విశేషం!



విజయప్రసాద్ తలిదండ్రులు వై.ఎల్.నారాయణ, మీనాకుమారి

ఉపాధ్యాయుడు, కమ్యూనిస్టు ఉద్యమ సానుభూతిపరుడయిన వైఎల్ నారాయణ, మీనాకుమారి దంపతుల ఏకైక కుమారుడు విజయప్రసాద్. కోరుకొండ సైనిక స్కూల్లో చదివాడు. సైన్యంలో చేరి దేశసేవ చేయాలనేది లక్ష్యం. మొదటి ప్రయత్నంలోనే ఎన్‌డీఏకు ఎంపికయ్యాడు. ఇండియన్ మిలటరీ అకాడమీలో కమిషన్డ్ ఆఫీసరు శిక్షణ పూర్తిచేసి 1980లో భారత సైనికదళం సిక్కు 6వ రెజిమెంట్‌లో కమిషన్డ్ ఆఫీసరుగా చేరాడు. కొద్దికాలంలోనే కెప్టెన్ గా పదోన్నతి పొంది స్వయంకృషితో పారా కమెండోగా ఎదిగాడు. హిమాచల్‌ప్రదేశ్‌లో పారాకమెండోగా పనిచేస్తూ ఆపరేషన్ బ్లూస్టార్, రాజస్థాన్ ఆపరేషన్స్‌లో పాల్గొని ఉన్నతాధికారుల దృష్టిని ఆకర్షించాడు. రక్షణశాఖ ఆదేశాల ప్రకారం 'భారత శాంతి పరిరక్షక దళం'లో సభ్యుడిగా 1986లో శ్రీలంకకు వెళ్లాడు.



కెప్టెన్ యర్రమనేని విజయప్రసాద్

అక్కడే రెండేళ్లపాటు కీలకమైన ఆపరేషన్లలో పాల్గొన్నాడు. మరికొద్దిరోజుల్లో సెలవుపై ఇంటికి రావాల్సి ఉండగా, కొత్తగా వివాహమైన తోటి కెప్టెన్ పట్ల సానుభూతితో అతడిని సెలవుపై పంపి, తాను విధుల్లో కొనసాగాడు. 1988 జూలై 11న విధినిర్వహణలో శత్రువులతో పోరాడి మరీ ప్రాణాలు కోల్పోయాడు. దేశభక్తి ఊపిరిగా నడిచిన విజయప్రసాద్ మరణం తల్లిదండ్రులకు తీరని గుండెకోతను మిగిల్చింది.

ఒక లక్ష్యం కోసం కొడుకు వీరమరణం చెందటం తమకు గర్వకారణమని వైఎల్ నారాయణ, మీనాకుమారి దంపతులు చెబుతారు. అయితే, తన కుమారుడి కడసారి చూపైనా దక్కకపోవటం వారిని ఇప్పటికీ కలచివేస్తుంటుంది. తర్వాతి రోజుల్లో శ్రీలంక సైన్యం చేతిలో ఎల్‌టీటీఈ నామరూపాల్లేకుండా పోవటం, తమిళ ఈలం నేత ప్రభాకర్‌న్ హతుడయ్యాడని తెలిసీ సంతోషించారు. నేటి యువతలో దేశభక్తి, త్యాగనిరతి వంటి లక్షణాలకు కావాల్సిన స్ఫూర్తిని కలిగించాలనే ఉద్దేశంతో కెప్టెన్‌విజయప్రసాద్ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులు, క్రీడాకారులకు నగదు బహుమతులు, ఇతర సేవాకార్యక్రమాలను చేస్తున్నారు.

ఆంధ్రాప్యారిస్‌లో వైభవంగా గురుపౌర్ణమి



కొల్లిపర సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

తెనాలి: గురుపౌర్ణమిని పట్టణ ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. వివిధ ఆలయాల్లో షిర్డి సాయినాథునికి కాకడహారతి, అభిషేకాలు, భజనలు ఘనంగా జరిగాయి. సాయిబాబాను విశేషంగా అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పట్టణ మారీసుపేటలోని దత్తసాయి ఆలయంలో 33వ గురుపౌర్ణమి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. సాయిబాబాకు విశేష పుష్పాలంకరణ చేశారు. సాయి సంకీర్తన సేవాసమితిచే భజనలు నిర్వహించారు. అఖండ సాయి నామ సంకీర్తనలతో 108 పల్లకీ ప్రదక్షిణలు చేశారు. వంశపారంపర్య ధర్మకర్త, చైర్మన్ రేటూరి నాగసాయి పర్యవేక్షించారు. రూరల్ మండల గ్రామం నందివెలుగులోని షిర్డీసాయి బాబా మందిరం సాయిక్షేత్రంలో షిర్డీసాయి సేవా ట్రస్ట్, హైదరాబాద్ ఆధ్వర్యంలో గురు పూర్ణిమ మహోత్సవాలు నిర్వహించారు. ఉదయం కాకడహారతితో మొదలుకొని విశేష అభిషేకాలు చేశారు. నందివెలుగు మహిళా బృందంచే గురుసంకీర్తన జరిగింది. ఎంవీ హరిప్రసాదరావు 'గురువైభవం'పై ప్రవచనం చెప్పారు. శారదా చలపతి, తెనాలి బృందంచే 'భజన సంధ్య' జరిపారు. తెనాలికి చెందిన పిన్నంరాజు బలరామమూర్తి దంపతులు సాయినాథునికి వెండి కిరీటాన్ని బహూకరించారు. సాయిక్షేత్రం చైర్మన్ ఎంవీ హరిప్రసాదరావు, కార్యదర్శి శ్రీవల్లి అన్నపూర్ణలు బాబా శాలువాతో సత్కరించి ప్రసాదాలను అందజేశారు. విష్ణుభట్ల ఘనాపాటిచే వేద ఆశీర్వచనం ఇప్పించారు. రాత్రి గ్రామవీధుల్లో పల్లకీ ఉత్సవం నిర్వహించారు.

స్థానిక మారీసుపేటలోని శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం (అప్పలస్వామి గుడి)లో శ్రీగురు దత్తాత్రేయుడికి, సాయిబాబాకు పంచామృత అభిషేకం, పళ్లరసాలతో అభిషేకం, విశేష అర్చన, కాగడ హారతి జరిగాయి. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని తమ స్వహస్తాలతో బాబాకు అభిషేకాలు అర్చనలు నిర్వహించారని ధర్మకర్త లంకా శివానందకుమార్ తెలియజేశారు. అలాగే మారీసుపేటలోని షిర్డీ సాయిమందిరంలో గురుపౌర్ణమిని వైభవంగా జరుపుకున్నారు. బోసురోడ్డులోని స్వరాజ్ టాకీస్ సెంటరులో గల షిర్డీ సాయి మందిరంలో గురుపౌర్ణమి ఉత్సవాలకు భక్తులు పోటెత్తారు. భారీ సంఖ్యలో విచ్చేసిన భక్తులకు వేర్వేరు క్యూలైన్లను ఏర్పాటుచేశారు. స్వామివారికి విశేష అలంకరణలు, అభిషేకాలు చేశారు.

కొల్లిపర: గురుపౌర్ణమి సందర్భంగా మండల కేంద్రం కొల్లిపర షిర్డీ సాయి బాబా మందిరంలో గురువారం ఘనంగా పూజలు నిర్వహించారు. సాయినాథ్‌కు వివిధ అభిషేకాలు నిర్వహించారు.



మారీసుపేట మందిరంలో హారతి ఇస్తున్న...



తెనాలి బోసురోడ్డులోని షిర్డీసాయి ఆలయంలో బాబా దర్శనానికి వేచి ఉన్న భక్తులు

ప్రత్యేకంగా అలంకరించారు. మహాగణపతిపూజ, శతఘటాభిషేకం, అఖండ సాయినామకీర్తన, సాయి సహస్ర నామార్చన, సాయి సత్యవ్రత కల్పాన్ని భక్తుల చేత పండితులు చేయించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజా కార్యక్రమాలు నిర్వహించటంతో భక్తులతో బాబా మందిరం కిటకిటలాడింది.

సుమారు125 మంది మహిళలు సామూహికంగా వ్రతాన్ని నిర్వహించారు. అనంతరం సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. పండితులు కుమారస్వామి, కుటుంబరావు సాయినాథుడి వృత్తాంతాన్ని వివరించారు. 5 వేల మందికి కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు గుదిబండి చినవెంకటరెడ్డి, జొన్నల అమ్మిరెడ్డి, అవుతు కృష్ణారెడ్డి, కూరపాటి రవిశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు.

అదే విధంగా మండలంలోని వల్లభాపురం, మున్నంగి, పిడపర్తిపాలెం, తూము లూరు, సిరిపురం గ్రామాల్లోని సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.


శాకంబరీ... నమోస్తుతే..



తెనాలి బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో..




మారీసుపేటలోని శ్రీచంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో ..



రామలింగేశ్వరపేట శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో..

ఆషాఢమాసం సందర్భంగా జగదంబ భక్తులకు శాకంబరిగా దర్శనమిచ్చారు. పట్టణంలోని వేర్వేరు దేవాలయాల్లో కొలువై ఉన్న అమ్మవార్లను కూరగాయలు, పండ్లతో చక్కగా అలంకరించారు. చక్కని వర్షాలు కురిసి, పాడి–పంట సమృద్ధిగా ఉండాలంటూ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిక్కిరిసి కనిపించాయి. - తెనాలి



కఠెవరంలోని బీసీ కాలనీలో..



అధ్వానం!

నందులపేటలో మురుగు కాల్వలు అధ్వానంగా మారాయి. వాటిని ప్రతిరోజు బాగు చేయకపోవడం వల్ల పారుదల నిలిచిపోయి మురుగంతా రోడ్లపైకి చేరుతుంది. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే వాటిని బాగు చేయించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు. - తెనాలిఅర్బన్

ఇంటర్మీడియట్ దశ అత్యంత ముఖ్యం



తెనాలిటౌన్: ప్రతి విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ దశ అత్యంత ప్రాముఖ్యమైనదని సెయింట్‌పాల్స్ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎంఎ లింకన్‌బాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక నాజర్‌పేటలోని సెయింట్ పాల్స్ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ నందు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా న్యాయవాది కరీమూన్, 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, శ్రీ మహాత్మా సేవా శాంతి ఆశ్రమం నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి పాల్గొని ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎంఎ లింకన్‌బాబు మాట్లాడుతూ విద్యార్థి దశలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని జీవితంలో ఉన్నతంగా రాణించాలని సూచించారు. వృత్తి విద్యాకోర్సుల ద్వారా పిల్లలు భవిష్యత్‌లో కలిగే ఉపాధి అవకాశాలను తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాలసెక్రటరీ ఆర్.షీలా సుజని, అధ్యాపకులు డాక్టర్ స్వేచ్ఛ, కీర్తి, అబ్రహాం, ఉష, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు–తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం



పేరెంట్స్ కమిటీ సభ్యులతో వీఎస్సార్ కళాశాల కరస్పాండెంట్ సుధాకర్



బాలికోన్నత పాఠశాలలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్‌రాధిక



జెఎంజె కళాశాలలో మాట్లాడుతున్న వేమూరు సీఐ ఆంజనేయులు

తెనాలి అర్బన్: కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిరా బాలికోన్నత పాఠశాలలో గురువారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయురాలు తోట కూర రాఘవయ్య, ఉపాధ్యాయులు సంధ్యారాణి, పద్మ, శేషకుమారి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

- వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో మెగా పేరెంట్స్ మీటింగ్‌ను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా విద్యాసంస్థలు తీర్చిదిద్దుతాయని చెప్పారు. సమావేశంలో ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్, పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.
- జేఎంజే కళాశాలలో మెగా పేరెంట్స్ మీటింగ్‌ను నిర్వహించారు.ముఖ్యఅతిథిగా పాల్గొన్న వేమూరు సీఐ పివి.ఆంజనేయులు మాట్లాడుతూ సైబర్ నేరాలపై విద్యార్థినీలు అవగాహన కలిగి ఉండాలన్నారు. సోషల్ మీడియా ఎక్కువగా ఉపయోగించడం వలన అనేక అనార్థలు ఉన్నాయని చెప్పారు. మోసపూరిత మేసేజ్‌లకు స్పదించవద్దని సూచించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ శాంత, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ రోజ్‌లీ, జెకెసి కళాశాల అధ్యాపకులు డాక్టర్ పి.నాగసుశీల, బాలథెరీసమ్మ పాల్గొన్నారు.

ఆరంభమైన టౌన్‌చర్చి శతవార్షిక మహోత్సవాలు

- శతవార్షిక శిలాఫలకం ఆవిష్కరణ
- ఉత్సవాల ప్రారంభసూచికగా బెలూన్ల ఎగురవేత
- మార్టిన్ లూథర్ విగ్రహానికి పుష్పాంజలి



శతవార్షిక శిలాఫలకాన్ని ఆవిష్కరించిన జోసెఫ్ పీఎస్, జేసురత్నకుమార్

తెనాలి: వంద సంవత్సరాల క్రితం రెవరెండ్ రేమండ్ హాఫ్ దొర నిర్మించి టౌన్‌చర్చిగా పిలుచుకుంటున్న క్రీస్తు దేవాలయం సర్వమతాలకు ఆరాధన కేంద్రంగా విలసిల్లుతుండటం గొప్పవిషయమని ఆంధ్రప్రదేశ్ మాజీ జూనియర్ జడ్జి, ఏఈఎల్ చర్చి కంట్రోలర్ కార్యదర్శి ఎన్.జేసురత్నకుమార్ అన్నారు. పట్టణ బోసురోడ్డులోని టౌన్‌చర్చి శతవార్షిక మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత చర్చి ప్రాంగణంలో కేరళ మాజీ సబ్–జడ్జి, ఏఈఎల్ చర్చి నిర్వాహకుడు జోసెఫ్ పీఎస్‌తో కలిసి శతవార్షిక శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. చర్చి వెలుపల ప్రత్యేక వేదికపై నుండి ఉత్సవాల ప్రారంభ సూచికగా బెలూన్లను ఎగురవేశారు. అక్కడే ఎన్.జేసురత్నకుమార్ మాట్లాడుతూ అమెరికా నుంచి వచ్చిన రెవరెండ్ రేమండ్ హాఫ్ దొర టౌన్‌చర్చి నిర్మాణంతో కేవలం ఆధ్యాత్మిక ప్రచారానికే పరిమితం కాలేదని గుర్తుచేశారు. 22 వేల ఎకరాలను కొనుగోలు చేసి, బడుగు వర్గాలకు పంపిణీ చేసిన పరిచర్యగా చెప్పారు. గుంటూరులోని లాం దగ్గర వ్యవసాయ క్షేత్రం కూడా ఏర్పాటు చేశారని, అమెరికా నుంచి వరి విత్తనాలను తీసుకొచ్చి, గుంటూరుకు పరిచయం చేశారని చెప్పారు. తెనాలి మండలంలోని హాఫ్‌పేట గ్రామానికి ఆయన పేరుతోనే నామకరణం చేశారని తెలిపారు.

శతవార్షిక ఉత్సవాల కన్వీనర్, న్యాయవాది పిల్లి విద్యాసాగర్ మాట్లాడుతూ రెవరెండ్ రేమండ్ హాఫ్ దొర డుంపుల్ బర్గర్ సహకారంతో ఏఈఎల్‌సీ మిషనరీతో కలిసి టౌన్‌చర్చిని నిర్మించారని చెప్పారు. భారతదేశంలోని మరే చర్చికి లేని ప్రత్యేకత ఇక్కడి క్రీస్తు దేవాలయానికి ఉందన్నారు. మహిమ కలిగిన దేవాలయం అయినందునే తెల్లవారుజామునుండి రాత్రి పొద్దుపోయేవరకు పలు మతాలు, కులాలకు చెందిన భక్తులు ఆరాధనలో పాల్గొంటున్నారని చెప్పారు. ఇంతటి విశిష్టమైన దేవాలయం శతవార్షిక ఉత్సవాల్లో అంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అనంతరం చర్చి ఆవరణలోని మార్టిన్ లూథర్ విగ్రహానికి పూలమాలను సమర్పించారు. ప్యారిష్ పాస్టర్ రెవ.దేవరపల్లి ఏసురత్నం, అడిషనల్ పాస్టర్లు యామర్తి లెనిన్‌బాబు, దగ్గుమల్లి సాల్మన్ రాజు, మత్తె విజయభాస్కర్ ప్రకాష్‌బాబు, అడ్ హాక్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. శతవార్షిక ఉపోద్ఘాతాన్ని డాక్టర్ జమండ్లమూడి ప్రశాంత్‌కుమార్, ముఖ్యఅతిథులు, వాక్యోపదేశకుల పరిచయాన్ని గోవతోటి పాల్‌ప్రభాకరరావు చేశారు. డాక్టర్ బీసీ పాల్, డాక్టర్ కొల్లూరు రిచర్డ్సన్ (హైదరాబాద్), స్టూడెంట్ క్రిస్టియన్ మూమెంట్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, వరల్డ్ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ మాజీ కార్యదర్శి మంచాల దీనబంధు, డాక్టర దాయం జోసెఫ్ ప్రభాకర్ (చెన్నై) వాక్యోపదేశం చేశారు. అతిథులు శతవార్షిక సావనీర్‌ను ఆవిష్కరించారు. సాయంత్రం గోవతోటి పాల్‌ప్రభాకరరావు అధ్యక్షతన ప్రత్యేక పాటలు, ఆరాధన, వాక్యసందేశం, సండే స్కూలు విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

ఏసురత్నం చిరస్మరణీయుడు



తెనాలి: అభ్యుదయ భావాలు కలిగిన మానవతావాది, దళిత ఉద్యమనేత కనపర్తి ఏసురత్నం 70వ జయంతిని గురువారం రాత్రి ఇక్కడి ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని అంబేడ్కర్ సేవాట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించారు. కనపర్తి బెన్‌హర్‌బాబు అధ్యక్షత వహించారు. కనపర్తి ఏసురత్నం ఆర్గానిక్ ఇంటెలక్చువల్ ఎలా అయిందీ, ఆయన ఉద్యమ సరళి, సాంస్కృతిక సహకారం, గ్రామాల్లోని పేదలకు చేసిన సహాయాలు, కులమతాలకు వ్యతిరేకంగా మరీ ముఖ్యంగా కొల్లిపర ప్రాంతంలో దళిత, వామపక్ష భావాలతో పనిచేసి, అమరుడైన ఏసురత్నం చిరస్మరణీయులనీ, ఆయన ఉద్యమ జీవితం యువతకు ఆదర్శమని పలువురు వక్తలు స్మరించుకున్నారు. జమ్మూల రమేష్, బేతాళ కృష్ణమోహన్,అక్కిదాసు కిరణ్, కేసీ బసవయ్య, షేక్ చర్ల,జిలుగు పీటర్, బండికళ్ల సతీష్, శశి, పాల్, మధుకర్, ఇమ్మనియల్, డాక్టర్ పిల్లి వాసు, డాక్టర్ అబ్రహం లింకన్ మాట్లాడారు.